
# అయ్యయ్యో బ్రహ్మయ్యో...



కథ

ఆదుర్తి బాల

ఫోను టోను కూనిరాగం తీసింది. డిస్ప్లేలో పేరు చూసిన బ్రహ్మానందానికి గుండె ఝల్లుమంది. బరువెక్కిన గుండెతో ఫోను తీసి హలో అన్నాడు.

"నేనండీ బ్రహ్మానందంగారూ! మీ ఇంటి ఓనర్ని. ఈ నెల నుండి రెండొందలు అద్దె పెంచుతున్నాను" విషయం చెప్పి ఫోను కట్ చేశాడు ఇంటి ఓనరు. నక్సలైట్ల బెదిరింపు విన్న రాజకీయ నాయకుడిలా డీలాపడిపోయాడు బ్రహ్మానందం.

"ఏమిటండీ ఏమిటలా దిగులుపడుతున్నారూ. ఇంటి ఓనరు అద్దె పెంచమన్నాడా ఏమిటి- ఈమాత్రం దానికే అలా బెంగెట్టేసుకుంటే ఎలా" అంది భార్య జాంబవతి.

"రెండొందలంటే మాటలేమిటే" అన్నాడు బ్రహ్మానందం దిగులుగా.

"మరందుకే నేనెప్పట్నించో మొత్తుకుంటున్నాను అప్పో సొప్పో చేసి ఓ స్థలమో, ఫ్లాటో కొనిపడేయండని. వేలకి వేలు అద్దెలు కట్టేబదులు ఓ సొంత ఇల్లుంటే నయం కదూ" అన్నది జాంబవతి.

"సరేలేవే ఇంక ఆ ప్రయత్నం మీదే ఉంటాలే" అన్నాడు బ్రహ్మానందం.

పేపర్లో క్లాసిఫైడ్స్ పేజీ చూస్తున్న బ్రహ్మానందం "జాంబూ!" అని అరిచాడు ఉత్సాహంగా.

"ఏంటండీ! దొరికిందా- దొరికిందా- ఇల్లు దొరికిందా" కలుపుతున్న చపాతీ పిండిని అలాగే వదిలేసి పరిగెత్తుకొచ్చింది జాంబవతి.

"ఇల్లు కాదు ఇళ్ళు- ఇళ్ళు దొరికాయ్. చూడు పేపర్నిండా అపార్ట్‌మెంట్స్ తాలూకు ఎన్ని ఎడ్వర్‌టైజ్‌మెంట్లో! కొన్నిటికైతే బాంక్ లోను సదుపాయం కూడా బిల్డర్సే చూసుకుంటారుట" అరచేతిలో వైకుంఠం కనిపించింది బ్రహ్మానందానికి.

"కలిసొచ్చే కాలమంటే ఇదేనేమో! మీరింక వెంటనే బయల్దేరి మనకో మంచి అపార్ట్‌మెంట్ చూడండి. ఆలస్యం అమృతం విషమన్నారు" అన్నది జాంబవతి.

"సరే సరే. ముందర ఆ చపాతీలు ఇలా తగలెయ్. అవి పీక్కు తినేసరికి ఓ గంట ఆలస్యం ఎలాగూ అవుతుంది" అనేసి నాలిక్కొరుక్కున్నాడు బ్రహ్మానందం.

"నా చపాతీలంటే అంత వెటకారమే" అంటూ చపాతీలొత్తే కర్రతో మొత్తింది జాంబవతి.

"అబ్బ ఊరికే సరదాకి అన్నాలేవే" భార్య చేతి సరసానికి మంటపెడుతున్న తలమీద రాసుకుంటూ అన్నాడు బ్రహ్మానందం. తన ఫ్రెండు ఐరావతం ఇంట్లో ఉన్నప్పుడు కూడా హెల్మెట్ పెట్టుకొని ఎందుకు తిరుగుతాడో అప్పుడర్థమైంది బ్రహ్మానందానికి.

ఆ పూటకి ఆఫీసుకి హాఫ్ డే లీవుపెట్టి పేపర్లో అడ్వర్‌టైజ్ చేసిన 'అద్భుత అపార్ట్‌మెంట్స్ చూడడానికి వెళ్ళాడు బ్రహ్మానందం. సెల్లార్‌లోనే టేబులు, కుర్చీ వేసుకొని కూర్చున్నాడు బిల్డరు.

"ఇక్కడేదో అపార్ట్‌మెంట్స్ ఖాళీగా ఉన్నాయన్నారు... ఎంతలో ఉన్నాయి సార్" అడిగాడు బ్రహ్మానందం బిల్డర్ని.

"డబుల్ బెడ్ రూం డీలక్స్ అపార్ట్‌మెంట్స్ సార్... పదిహేను లక్షలు చెబుతున్నాం. మీకు నచ్చితే రేటు మాట్లాడుకుందాం" అన్నాడు బిల్డరు.

"ఇంతకీ ఏ ఫ్లోర్‌లో ఖాళీలున్నాయి సార్" అడిగాడు బ్రహ్మానందం.

"కిందవన్నీ అయిపోయాయి. టాప్ ఫ్లోర్‌లో ఉన్నాయి" అన్నాడు బిల్డరు.

"అబ్బో! టాప్ ఫ్లోరా! ఈ ఎండాకాలం నెత్తి మాడిపోతుంది కానీ వద్దులెండి సార్" అన్నాడు బ్రహ్మానందం.

"అందుకే కదండీ పాప్ సీలింగ్ చేయించాం. లిఫ్ట్ ఉంటుంది గాబట్టి మెట్లెక్కి పైకెళ్ళాలన్న బాధ లేదు. పైగా ఎ.సి. ఫ్రీగా ఇస్తున్నాం"

ఎ.సి. ఫ్రీ అనేసరికి బ్రహ్మానందానికి హుషారొచ్చింది "సర్లెండి. మరి ఓసారి చూపించండి" అన్నాడు.

"వాచ్‌మాన్" కేకేశాడు బిల్డరు. ఆ పక్కనే బట్టలు ఇస్త్రీ చేస్తూ వీళ్ళ సంభాషణ వింటున్న వాచ్‌మాన్ పరుగెత్తుకొచ్చాడు.

"సార్‌కి అపార్ట్‌మెంట్స్ చూపించు" అన్నాడు బిల్డరు.

"రండి సార్" మెట్లవైపు దారితీస్తూ అన్నాడు వాచ్‌మాన్.

"లిఫ్ట్ ఉందన్నారుగా" అన్నాడు బ్రహ్మానందం.

"లిఫ్ట్ రావడానికి ఇంకో నెల పడుతుంది సార్" అన్నాడు బిల్డరు.

వాచ్‌మాన్ వెనకాలే మోకాళ్ళు పట్టుకొని మెట్లెక్కుతూ ఐదో అంతస్థుకి చేరుకున్నాడు బ్రహ్మానందం. తలుపు తాళం తీసి "ఇది హాలు సార్" అన్నాడు వాచ్‌మాన్. నలుగురు స్థూలకాయులు ఒకరి పక్కన ఒకరు నిలబడితే ఎంత స్థలం పడుతుందో అంత వెడల్పుంది ఆ హాలు. కామన్ వాల్స్ కాబట్టి ఇటు అటూ కిటికీలు లేవు. సొరంగ మార్గంలా అనిపించింది బ్రహ్మానందానికి. ఆ హాలుకున్న ఓ గోడ నిండా కప్‌బోర్డ్‌లు బిగించి ఉన్నాయి. హాలులోని చీకటికి అలవాటుపడ్డాక బ్రహ్మానందానికి పరిసరాలు కాస్త కనిపించడం మొదలుపెట్టాయి.

"సార్ బెడ్‌రూం చూడండి. ఇది మాస్టర్ బెడ్‌రూం. అటాచ్డ్ టాయిలెట్" చెప్పాడు వాచ్‌మాన్.

డబల్ కాట్ వేస్తే రెండడుగుల స్థలం కూడా మిగలదా బెడ్‌రూంలో.

'పోనీలే ఇదీ ఒకందుకు మంచిదే. చంటి వెధవ నిద్రలో మంచం మీంచి దొర్లిపడిపోతాడనే దిగులుండదు' అని సర్దిచెప్పుకున్నాడు బ్రహ్మానందం. ఆ పక్కనే ఇంకో బెడ్‌రూము. దాని కానుకొని చిన్న బాల్కనీ.

"కిచెన్ చూద్దురుగాని రండి" అన్నాడు వాచ్‌మాన్.

అదెలా ఉంటుందో అని భయపడుతూనే తెగించి వెళ్ళి చూశాడు బ్రహ్మానందం. ఒక్క మనిషి మాత్రమే నిలబడి వంట చేసుకునేందుకు సరిపోయే స్థలం వున్న కిచెన్. 'జాంబూ వంట చేస్తూంటే వెనకాలే వెళ్ళి వాటేసుకోవడం లాంటి వెధవ పనులు చేస్తే ఇద్దరం అందులో ఇరుక్కుపోయి మమ్మల్ని బైటకి లాగడానికి మూడో వ్యక్తి రావాల్సిందే' అనుకున్నాడు బ్రహ్మానందం. కిచెన్ పక్కన మూసి వున్న తలుపుని చూసి 'అది స్టోర్ రూమా' అన్నాడు బ్రహ్మానందం.

"అది ఇంకో టాయిలెట్ సార్" అన్నాడు వాచ్‌మాన్.

వంట గదినీ, టాయిలెట్‌నీ విభజిస్తూ ఒకటే గోడ. గ్లోబలైజేషన్‌తో ప్రపంచం దగ్గరైపోయింది. అపార్ట్‌మెంట్ కల్చరొచ్చి వంటింటికీ, పడకటింటికీ, టాయిలెట్స్‌కీ మధ్య దూరం తగ్గించి మనిషికి ఎక్కువ దూరం నడిచే శ్రమ తప్పించాయి. అతని ఆలోచన పసికట్టినవాడిలా అన్నాడు వాచ్‌మాన్. "టైం చాలా విలువైంది కదు సార్. మా బిల్డరుగారు ఆ సంగతి కనిపెట్టే ఈ ఏర్పాటు చేశారు సార్. పొద్దున్నే ఆఫీసులకీ, స్కూళ్ళకీ పొయ్యేవాళ్ళు... మీలాంటివారికి ఒక నిముషం కలిసొచ్చినా కలిసొచ్చినట్టే కదా!" అన్నాడు వాచ్‌మాన్.

* * *

"మా అపార్ట్‌మెంట్స్ మీకు నచ్చే వుంటాయి. ఎందుకంటే ఈ కాలపు ట్రెండ్‌కి తగ్గట్టుగా కట్టాం" అన్నాడు బిల్డరు.


అతడి ఓవర్ కాన్ఫిడెన్స్‌కి ఆశ్చర్యపోతూనే "మరీ ఇరుగ్గా ఉన్నాయి సార్... పైగా రేటెక్కువ" అన్నాడు బ్రహ్మానందం.

"ఇరుకా- భలేవారే. సింగిల్ ఫ్యామిలీకి చక్కగా సరిపోతాయవి. ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలెక్కడున్నాయి సార్... ఫ్యామిలీ అంటే భార్యా, భర్త, ఒకరో ఇద్దరో పిల్లలూ. వాళ్ళు కూడా ఇంట్లో ఉంటున్నారా అంటే అదీ లేదు. భార్యా, భర్త ఉద్యోగాలకెళితే చంటిపిల్లలు క్రచ్‌లో, పెద్దపిల్లలు స్కూళ్ళు, ట్యూషన్లనీ బయటే ఉంటున్నారు. ఇహపోతే రాత్రిళ్ళు పడుకోడానికేగా ఇంటికొచ్చేది. బైటంతా ఆఫీసు పనితోనూ, చదువుతోనూ అలిసిపోయి వచ్చేవాళ్లు ఎక్కడ పడుకున్నా సుబ్బరంగా నిద్రపోతారు. ఇదంతా మీకు తెలీనిదేం కాదు. మనుషులు ఇంట్లో గడిపినప్పుడే కదూ సార్ ఇల్లు ఇరుకని బాధపడేది. ఇక రేటు విషయానికొస్తే ఇదేం పెద్ద ఎక్కువ రేటేం కాదుసార్. ఏదో ప్రస్తుతం మార్కెట్ డల్‌గా ఉందని ఈ రేటు చెప్తున్నాం కానీ మామూలుగా ఐతే పద్దెనిమిదికి తక్కువ రాదు సార్. ఇది మంచి బిజీ సెంటర్. ఇక్కడ్నుంచి రైల్వేస్టేషన్, బస్టాండ్, కూరల మార్కెట్ అన్నీ దగ్గరే. ఇంతమంచి సెంటర్లో ఇల్లు దొరకడమే కష్టం" అన్నాడు బిల్డరు.

"మీరు చెప్పేది బానే ఉంది గానీ బస్టాండ్, రైల్వేస్టేషను దగ్గర్లో ఉన్నాయి కదా! ఈ ఊరు మీంచి వెళ్ళే మా బంధువులు జర్నీ బ్రేక్ చేసుకొని మా ఇంట్లో దిగితే వాళ్ళందరినీ ఈ ఇరుకింట్లో సర్దడం కష్టం కదా" అన్నాడు బ్రహ్మానందం.

"ఆ భయం ఎందుకు సార్! గదులు ఇరుకనిపిస్తే వాళ్ళవల్ల మీకు ఇబ్బంది అని గ్రహించి ఆ వచ్చిన బంధువులంతా ఉండడానికి సిగ్గుపడి వాళ్ళ దోవన వాళ్ళేపోతారు. బంధుబలగాల పీడకూడా వుండదు మీకు"

ఒక ప్లస్ పాయింట్ దొరికినందుకు బ్రహ్మానందానికి సంతోషమేసింది. "సరేలెండి. మా ఫ్యామిలీని కూడా తీసుకొచ్చి ఓసారి చూపించాక రేటు మాట్లాడుకుందాం" అన్నాడు బ్రహ్మానందం.



దారిలో అతడి ఫ్రెండు సప్తగిరి కనిపించాడు.

"ఏవిట్రా ఇలావచ్చావ్" అంటూ పలకరించాడు. జరిగినదంతా చెప్పి "ఇల్లు ఇరుగ్గా వుంది కానీ మంచి సెంటర్లో వుంది. తీసుకోవాలో వద్దో ఆలోచన తెగట్లేదు" అన్నాడు.

"ఇంత కీ లిఫ్టుందా?" ప్రశ్నించాడు సప్తగిరి.

"లిఫ్టుకి ప్రొవిజనుంది కానీ ఇంకా లిఫ్టు రాలేదు" అన్నాడు బ్రహ్మానందం.

"అయితే కొనుక్కోకు" అన్నాడు సప్తగిరి.

"ఇంకో నెలలో వచ్చేస్తుందట" అన్నాడు బ్రహ్మానందం.

"అలాగే చెప్తారు. నమ్మి మోసపోకు. మూడేళ్ళబట్టి అనుభవిస్తున్నాను. ఎలాగో లిఫ్టు వస్తుందన్నారు కదాని ఫ్లాటు కొనుక్కున్నాను. అదిగో వస్తుంది, ఇదిగో వస్తుంది అన్నారు. కానీ ఇంతవరకూ లిఫ్టు లేదు. అదుగుదామంటే బిల్డరు కనబడడు. రోజూ మెట్లు ఎక్కీ దిగీ మోకాళ్ళ జాయింట్లన్నీ అరిగిపోయాయి. పోనీ నేనంటే ఫరవాలేదు. మా అమ్మా, నాన్నా ఇద్దరూ హార్ట్ పేషంట్లు. నెలకోసారి వాళ్ళని డాక్టరు చెకప్‌కి తీసుకెళ్ళాలి"

"అయ్యో మరేం చేస్తున్నావ్"

"శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు ఉంటాయిగా. మేదరవాడి దగ్గరకెళ్ళి రెండు గట్టి వెదురు బుట్టలల్లించాను. బైటకెళ్ళాల్సినప్పుడల్లా ఒకదాంట్లో అమ్మని, ఇంకోదాంట్లో నాన్ననీ కూర్చోమని నేనూ మా ఆవిడా చెరో తట్టా నెత్తిన పెట్టుకొని మెట్లు దిగుతున్నాం"

"ఆహా! కన్నవాళ్ళ బాధ్యతని బరువనుకునే సుపుత్రులున్న ఈ రోజుల్లో వాళ్ళని నెత్తిన పెట్టుకొని చూసుకుంటున్నావన్నమాట. హ్యాట్సాఫ్‌రా!" అన్నాడు బ్రహ్మానందం.

సప్తగిరి అనుభవం విన్న బ్రహ్మానందం అపార్ట్‌మెంట్ కొనాలనే ఆలోచన పక్కన పెట్టాడు. ఇంటికెళ్ళగానే గుమ్మంలోనే అడిగేసింది జాంబవతి ఇల్లు సంగతి. జరిగిందంతా చెప్పి "ఇక ఇండివిడ్యువల్ హౌసెసే నయమేమో, ఒకళ్ళతో గొడవుండదు" అన్నాడు.

"ఔనండి. అపార్ట్‌మెంటయితే రీసేల్ వాల్యూ వుండదట కదా! ఇక ఈ గొడవలొద్దుగానీ మంచి స్థలం చూడండి. వాస్తుబ్రహ్మ బిరుదాంకితుడు మా నాన్న దగ్గరుండి మరీ వాస్తుప్రకారం చక్కని ఇల్లు కట్టిస్తాడు" అన్నది జాంబవతి.

"మీ నాన్నా- ఒద్దులే" అన్నాడు బ్రహ్మానందం.

"పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదుట. మా నాన్న అంటే మీకస్సలు గిట్టదు. ఆయన వాస్తు బ్రహ్మాండంగా చూస్తాడని 'వాస్తుబ్రహ్మ' అని బిరుదిచ్చారుట."

"ఎవరో తలకు మాసినవాళ్ళు ఇచ్చుంటారు ఆ బిరుదు. నన్నడిగితే 'వాస్తు విధ్వంసక' బిరుదే ఆయనకు సూటబుల్. హాయిగా ఇల్లు కట్టుకుని లక్షణంగా కాపురాలు చేసుకుంటున్నవాళ్ళని వాస్తు పేరు చెప్పి బెదిరించి ఇంటిగోడలు కూలగొట్టించి, కిటికీలు మార్పించి వాళ్ళిల్లు ధ్వంసం చేసేవరకూ వదలడు మీ నాన్న. అలా మీ నాన్నవల్ల ఇళ్ళు కూలగొట్టుకుని తిరిగి కట్టుకునేందుకు డబ్బుల్లేక వారంతా రోడ్లమీద పడి తిరుగుతున్నారిప్పుడు" అన్నాడు బ్రహ్మానందం.

"అనండి... అనండి. మా పుట్టింటివారంటే మీకె

ప్పుడూ లోకువే. ఆయన చెప్పిన వాస్తుప్రకారం ఇల్లు కట్టుకొని బాగుపడినవారి గురించి మీకు తెలీదు" అన్నది జాంబవతి కోపంగా.

"ఎందుకు తెలీదూ- మీ నాన్నకి వాస్తు చూపించి ఇల్లు కట్టుకున్న కపాలేశ్వర్రావుకి గృహప్రవేశం నాడే ఇంటి పిట్టగోడ కూలి నెత్తినపడి కపాలం పగిలి మూడునెలలు హాస్పిటల్లో రెస్టు తీసుకున్నాడుగా"

"అదే మరి వాస్తు సరిగా అర్థం చేసుకోకపోతేనే ఈ వెర్రి తొర్రి మాటలొస్తాయి. ఆయనకి మరణ గండ ముందట. ఆ గండాన్ని మా నాన్న వాస్తుతో అడ్డుకో బట్టి చిన్న యాక్సిడెంట్‌తో పోయిందట" మా నాన్న చెప్పాడు.

"ఇలాంటి కథలు మీ నాన్న బానే చెప్తాడులే" అన్నాడు బ్రహ్మానందం.

* * *

"ఏమండీ బ్రహ్మానందంగారూ! మీరేదో స్థలం కొనాలనే ఆలోచనలో ఉన్నారట కదా" లంచ్ అవర్లో అడిగాడు అతడి ఫ్రెండు పుల్లారావు.

"అవును సార్. కానీ ఈ సిటీలో కొనాలంటే మాటలా! మూటలు గుమ్మరించాలి. మనకంత స్థోమత లేదులెండి" దిగులుగా అన్నాడు బ్రహ్మానందం.

"అలా నిరాశపడకండి సార్. మీకు బంగారం లాంటి స్థలం ఇప్పిస్తాను. కాకపోతే సిటీకి కొంచెం దూరం అనుకోండి. కానీ అదేం పెద్ద ప్రాబ్లం కాదు సార్. ఆ స్థలాలు కూడా డెవలప్ అవుతాయి త్వరలోనే. నాతో వస్తే చూపిస్తాను" అన్నాడు పుల్లారావు.

"మరీ నగర శివార్లలో కదా" అన్నాడు బ్రహ్మానందం తటపటాయిస్తూ.

"అంతగా అన్నిటికీ ఆలోచిస్తే పనులు జరగవు సార్. ప్రతి ప్రాబ్లమ్‌కీ ఓ సొల్యూషనుంటుందనే విషయం మర్చిపోకండి. ఓ నానో కారు కొనిపడేసుకోండి. ఎంత దూరమైనా ప్రాబ్లం వుండదు. ఇహపోతే దొంగల భయం అంటారా- మీ గృహప్రవేశం రోజున మా మిత్రులంతా కలిసి ఏ అల్సేషియన్ డాగ్‌నో, జర్మన్ షెపర్డ్ డాగ్‌నో కానుకగా ఇస్తాం. ఇప్పుడు కొనుక్కున్నా వచ్చే ఏడాదికి మీ స్థలం డబల్ రేటు అయిపోతుంది. ఆలోచించుకోండి" అన్నాడు పుల్లారావు.

"సరే పదండి. ఓసారి చూస్తే పోయేదేం లేదులెండి" అన్నాడు బ్రహ్మానందం.

ఇద్దరూ సిటీ బస్సెక్కాక పుల్లారావే టిక్కెట్లు తీసుకున్నాడు. "ఇహ మీరు కాసేపు నిద్రపోండి సార్" అన్నాడు పుల్లారావు. అలా అంటూనే నిద్రలోకి జారుకున్నాడు. బ్రహ్మానందానికి అతని ధోరణి అంతుబట్టలేదు. కిటికీ లోంచి సిటీలోని మొత్తం షాపింగ్ కాంప్లెక్సుల్నీ ప్రకటనల హోర్డింగులనీ చూసేశాడు. డ్రైవరూ, కండక్టరూ తప్ప బస్సులో జనాలెవరూ మిగల లేదు. "బస్సింక ముందుకెళ్ళదు లేవండి సార్" అన్న కండక్టరు పిలుపుతో పుల్లారావుని నిద్రలేపాడు బ్రహ్మానందం. బస్సు దిగి ఇద్దరూ ఓ ఫర్లాంగు దూరం నడిచాక "ఇదే సార్ నే చెప్పిన స్థలం. గజం వెయ్యి రూపాయలే" అన్నాడు పుల్లారావు.

"చుట్టుపక్కల ఎక్కడా నర సంచారం లేదు. నాకు భయమేస్తే చదూకోడానికి ఆంజనేయ దండకం కూడా రాదాయె. కంగారులో తప్పులు పాడానంటే ఆ స్వామి నన్ను తోకతో ఒక్కటిచ్చుకుంటాడు" పరిసరాల వంక చూసి అన్నాడు బ్రహ్మానందం.

"మీకా భయం అక్కర్లేదు సార్. ఈ స్థలానికి ఇటు, అటూ అన్ని స్థలాలూ అమ్ముడుపోయాయి. కొన్నవాళ్ళు అందరూ మీలాగే ఎడ్యుకేటెడ్ అండ్ డీసెంట్ సార్" అన్నాడు పుల్లారావు.

"ఏమిటీ ఈ స్థలాలన్నీ అమ్ముడుపోయాయా?" ఆశ్చర్యంగా అన్నాడు బ్రహ్మానందం.

"అవును సార్. ఈ స్థలంపక్కనే డి.యస్.పిగారు, ఆ పక్కన జడ్జిగారూ స్థలం కొని ఈమధ్యనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇంకో ఆర్నెల్లలో శంకుస్థాపన చేసి పునాదులేయిస్తారట. మీ అదృష్టం ఏంటంటే మీ ఇంటిముందు మెయిన్‌రోడ్డు వస్తుంది. మీరు కాదంటే ఈ స్థలం కొనడానికి నలుగురు క్యూలో వున్నారు. మీరు ఫ్రెండు కదాని ముందర మీకు ప్రిఫరెన్స్ ఇచ్చాను" ఊదరగొట్టేశాడు పుల్లారావు.

కంగారుపడిపోయాడు బ్రహ్మానందం. "రేపే అడ్వాన్స్ ఇస్తాను. ఈ స్థలం నాకే బుక్ చేయండి" అన్నాడు. అలా ఓ రెండొందల గజాలు కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు బ్రహ్మానందం.

* * *

"ఏమిటండీ బ్రహ్మానందంగారూ! ఈమధ్య పుల్లారావుతో కనిపిస్తున్నారు. కొంపదీసి ఏ స్థలమైనా కొన్నారా ఏంటి?" అన్నాడు ఇంకో కొలీగ్ రమణమూర్తి.

"అవునండి. రెండొందల గజాలకి రిజిస్ట్రేషన్ కూడా అయిపోయింది. ఊరికి దూరమే కానీ ఫ్యూచర్లో బాగా డెవలప్ అయిపోతుందట. అప్పుడు రేట్లు పెరిగితే కొనుక్కోవడం కష్టం కదా" అన్నాడు బ్రహ్మానందం.

నిట్టూర్చాడు రమణమూర్తి. "ఆ పుల్లారావుగాడు ఈమధ్య సైడు బిజినెస్‌గా స్థలాలు కొనడం, అమ్మడం చేస్తున్నాడులెండి. ఊరి చివర పోరంబోకు స్థలాలు చౌకగా కొనేసి మీలాటి అమాయకులకి మాయ మాటలు చెప్పి డబల్ రేటుకి అమ్మేస్తున్నాడు"

"అంటే ఆ స్థలం ఇపుడు డెవలప్ కాదా!" తీవ్రమైన నిరాశలో కూరుకుపోయాడు బ్రహ్మానందం. మయసభ చూడబోయి భంగపడిన దుర్యోధనుడిలా అతడిలో అంతర్మథనం ఇలా సాగిపోయింది. 'ఇంటాయన అద్దె పెంచేనేల... పెంచెను ఫో... ఏ పాల ఖర్చో, కూరల ఖర్చో తగ్గించుకొని అద్దె కట్టాలని ఆలోచించకుండా ఆవేశం తెచ్చుకోనేల... ఆవేశం వచ్చెను ఫో... దానిని అణచుకొనుటకు ప్రయత్నింపక అపార్ట్‌మెంట్ కోసం పరుగెత్తనేల... పోయితిని ఫో... ఏదో ఒక అపార్ట్‌మెంట్ అని సరిపెట్టుకోక ఇండివిడ్యువల్‌గా వుండాలని ఆశపడి స్థలముకై ప్రయత్నించి ఇలా బ్రోకరుగాడి చేతిలో మోసపోనేల... ఇంటి ఓనరు అద్దె పెంచినప్పుడల్లా అద్దెకున్నవాళ్ళకి ఈమాత్రం ఆవేశం రావడం సహజం. అయినా వాళ్ళందరూ నోర్మూసుకుని అద్దెకట్టట్లేదా... హా! హతవిధీ... నా స్థలము ఎప్పటికి డెవలప్ అవుతుందో... నేనెప్పటికి ఇల్లు కట్టగలనో కదా... అయ్యో అయ్యయ్యో బ్రహ్మయ్యా... ఎంత మోసపోయావయ్యా..."

బ్రహ్మానందం లాటివారి ఆశలన్నీ తీరాలని కోరుకుందాం.

☆



## నాజూకు స్నేహ

ఈమధ్య వస్తున్న కుర్రహీరోయిన్ల జోరులో కాస్త వెనకబడిన స్నేహ తనకొచ్చిన అవకాశాల్ని ఏమాత్రం వదుల్చుకోదల్చుకోలేదు. అయినా కూడా వయసు తెచ్చే పర్సనాలిటీ మార్పుల్ని సైతం అధిగమించేందుకు అన్నట్టు చాలామంది లాగే తనూ బరువు తగ్గే కార్యక్రమాన్ని చేపట్టిందిట. గత ఎనిమిది నెలలుగా ఆమె తెగ డైటింగ్‌లూ, ఎక్సర్‌సైజులూ ఎట్సెట్రాలు చేసేవి తగ్గిన బరువెంతో తెలుసా? 7 కిలోలట. అంటే నెలకి కిలోకన్నా తక్కువేనన్నమాట. ఈమాత్రం నాజూకుతనం చాలంటోంది స్నేహ.